ఎస్‌విజేలో పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ సర్వే

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటి ఎస్‌విజే పాఠశాలలో కేంద్రియ మాధ్య మిక విద్యా బోర్డ్ న్యూఢిల్లీ వారి ఆధ్వ ర్యములో పాఠశాలలోని 9వ తరగతి విద్యా ర్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ అనే సర్వే ను జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ సర్వేను సీబీఎస్సీ న్యూఢిల్లీ ప్రతినిధులు జయశ్రీ మహంతి, సమీరా సాహు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల చైర్మన్ బివివి ప్రసా ద్రావు, ప్రధాన ఉపాధ్యాయులు జగ్గారావు, అధ్యాపకులు పద్మిని, స్వప్నిల్, కృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్
- ముందస్తు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రెవిన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి, రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవిన్యూ అధికారులతో రెవిన్యూ సదస్సుల నిర్వ హణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుం డ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. జిల్లాలో నిర్వహించనున్న రెవిన్యూ సదస్సుల ఏర్పాట్లుపై రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరాతీసారు. అనంతరం మంత్రివర్యులు మాట్లాడుతూ అందరూ సమన్వ యంతో ముందుకు సాగాలని, అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పరిష్క రించాల న్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 1464 రెవిన్యూ గ్రామాలున్నాయని, అందులో 738 రీసర్వే పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలో జరుగనున్న రెవిన్యూ సదస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రివర్యులకు ఆహ్వా నించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు సంబంధించి ముందస్తు ప్రచారం నిమిత్తం కరపత్రాలు పంపిణీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలె క్టరేట్ ఎ.ఓ సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు సిబ్బంది హాజరయ్యారు.

ఘనంగా కామ్రేడ్ గురుచరణ్ పట్నాయక్ వర్ధంతి

విశాలాంధ్ర - పలాస : ఒడిస్సా రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అభివృద్ధికి కామ్రేడ్ గురుచరణ్ పట్నాయక్ ఎనలేని కృషి చేశారని క్షేత్రపూర్ మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల బరం పురం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర సిపిఐ వ్యవస్థాపకులు గురుచరణ్ పట్నాయక్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్నాయక్ తన జీవిత చరమాంకం వరకు పార్టీని నమ్ముకుని ఉన్నారని, పార్టీ శాఖలను విస్తరించేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. దాస్ లేని లోటు పార్టీకి తీరనిదని, ఆయన ఆశయాలను పార్టీ శ్రేణులు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయంతి దాస్, ప్రొఫెసర్ మానస్ బెహరా, జూడిస్టిర్ మొహాపత్ర తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో వేగం పెంచాలి

డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రూరల్ మండలం బైరి గ్రామంలో పర్యటించిన ఆయన గోకులం, సీసీ రహదారుల పనులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 3303 సిమెంట్ రహదారి పనులు, 437 సిమెంట్ కాంక్రీట్ కాలువల పనులు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ద్వారా మంజూరయ్యాయి అన్నారు ఇందుకు సంబంధించి రూ. 276.54 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో 90 శాతం పైబడి పనులు జరుగుతున్నాయని మిగిలిన పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతి నాటికి పల్లెల్లో నూతన రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఫిష్ పాండ్స్, ఫారం పాండ్స్, ఇల్లు లేదా కార్యాలయాల పైకప్పు నుంచి వచ్చే నీటిని ఇంకింపజేసే పనులు, పెర్కులేషన్ టాంక్స్, గోకులాలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, తదితర పనులను మండల స్థాయిలో శరవేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రారంభించిన ప్రతి పని వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని అన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులకు నిధులు కొరత లేదని, ప్రతి గురువారం పనులు చేసిన మేరకు బిల్లులు నమోదు చేసి శుక్రవారం నాటికి చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సహా రాష్ట్ర అధికారులు కూడా ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడి వెంట ఏపీవో సీతారాం, జేఈ పి.బాలముకుంద బాబు, టిఏ.రత్నాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రబీలో సాగు చేసే పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్‌రావు

విశాలాంధ్ర - కవిటి : రబీలో సాగు చేసే పంటలకు రైతులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించు కోవాలని వ్యవసాయ సహాయ సంచా లకులు జగన్మోహన్ రావు రైతులకు సూచించారు. ఈ మేరకు బుధవారం వరక గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్ రావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి మంగళవారం, బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశం రైతుల వద్దకు వెళ్లి రైతుల యొక్క సలహాలు సూచనలు తెలుసుకొని ప్రభుత్వం అమలు చేసేటటువంటి పథకాలను వివరించడం పంటలను పరిశీలించడం అని తెలిపారు. అలాగే ప్రస్తుత కాలంలో వరి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి తెలిపారు. నూతన వంగడాలతో వినియో గించడం వలన పురుగు తెగుళ్లను తట్టుకుంటాయని, ప్రతి ఏటా పాత వెరైటీల్ని సాగు చేయడం వలన దిగుబడి ప్రభావం పడుతుందని తెలిపారు. రానున్న ఖరీఫ్‌కు ఆర్‌జిఎల్ 7039 నూతన వంగ దాన్ని ఈ ప్రాంతానికి అనువుగా ఉంటుందని మినీకిట్ రూపంలో ఈ ప్రాంతానికి అందజేస్తామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస నుంచి రాగి విత్తనాలైనటువంటి గోస్తాని, హిమా అనే నూతన వెరైటీలను మినీ కిట్ రూపంలో రైతులకు అందిస్తున్నామని దీని ద్వారా తయారైన విత్తనాలను రానున్న కాలాన్ని రైతులకు సరఫరా చేసుకోవాలని తెలియజేశారు. ఉద్యానవన శాఖ అధికారిని పి.మాధవిలత మాట్లాడుతూ ఉద్యాన పంటలో ఉన్నటువంటి పథకాలను వివరించారు. నీటి సదుపాయం ఉన్న కొబ్బరి తోటల్లో కోకో వంటలు అంతర పంటలుగా వేసు కోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కవిటి మండలం వ్యవసాయ శాఖ అధికారి బడగల దుర్గాప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ కళ్యాణ్, వ్యవసాయ సహాయకులు జగదీష్, ఎంపీఈఓ లలిత కుమారి, స్థానిక సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియ, వీఆర్వో కుర్మానాయకులు, మహేష్ జెన్న, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన రోడ్లు నిర్మాణానికి రూ.22.35 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : నియోజకవర్గంలోని నూతనంగా రోడ్లు నిర్మా ణానికి సుమారు రూ.22.35 కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం కత్తిరివానిపేట క్యాంపు కార్యా లయంలో ఆయన నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన ఎంపిడివోలు, పంచాయితీరాజ్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ నియోజక వర్గంలో రహదారులు లేని గ్రామాలను గుర్తించి, వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసిన గ్రామాలకు త్వరలోనే రోడ్ల పనులు ప్రారం భించేలా అధికారులందరూ చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఎంపిడివోలు, బి.మధుసూధనరావు, జి.రవి కుమార్, కె.అప్పల నాయుడు, ఎం.వి.వి.యు.మోహన్‌కుమార్, పంచాయితీ రాజ్, డి.ఈ, సత్యంనాయుడు, బగ్గు నర్సింగరావు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ కోసం కృషి

పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి

విశాలాంధ్ర - కవిటి : ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు పై కృషి చేస్తానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధ వారం కవిటి మండలం లో గల ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్, మండల ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు కెజిబివి టీచర్లు కు మినిమమ్ టైం స్కేలు కోసం పిడిఎఫ్ ఫ్రంట్ కృషి చేస్తుందని అన్నారు.అలాగే విద్యారంగంలో అశాస్త్రీయమైన పాఠశాల పని వేళలను, 100 రోజులు ప్రణాళిక ను,యాప్ ల భారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలుచేయాలని, దీనికై ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు.వారిని సొసైటీ నుండి బయటకు తీసుకురావాలన్నారు. వివిధ పాఠశాలలను, కాలేజీలను పర్యటించి, విద్యారంగంపై అవగాహన ఉన్న నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే.దాలయ్య, జిల్లా కార్యదర్శి ఎం.మురళి ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి వి సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - టెక్కలి : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా 6,7,8,9 తేదీలలో నిర్వహించడం జరుగు తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పేరుకుపోయిందని, యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి అని విమర్శించారు. యువజన హక్కులు సాధనకు ఏఐవైఎఫ్ నిర్విరామంగా కృషి చేస్తుందని అన్నారు. భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. అందరికీ విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని వారు ఆరోపించారు. రైతాంగ సాయుధ పోరాటానికి, అకుంఠిత త్యాగాలకు నెలవయిన శ్రీకాకుళం పట్టణంలో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కిరణ్, చందు, శ్యామ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కడపలో కబడ్డీ ఆటగాడు సంతోష్ కుమార్‌కు సన్మానం

విశాలాంధ్ర - పలాస : మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జెస్సీ కబడ్డీ బృందం సభ్యుడు బడ్డీ సంతోష్ కుమార్ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో కడప జిల్లా తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో కడప జిల్లాకు మూడవ స్థానం వచ్చినందుకు బుధవారం కడపలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో బడ్డీ సంతోష్ కుమార్ ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొడ్డపాడు జెస్సి కబడ్డీ బృందం ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీ రావు కడప జిల్లా కబడ్డీ నిర్వాహకులకు, సంతోష్ కుమార్ కు అభినందనలు తెలిపారు.

సోయిల్ హెల్త్ కార్డులు మంజూరు చేసిన ఏఓ సునీత

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలో బాలసీమ గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ శాఖాధికారి, కె.సునీత రైతులకు సోయిల్ హెల్త్ కార్డులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన ఈ సోయిల్ హెల్త్ కార్డులు మండలంలో సుమారు 420మంది రైతులకు అందచేశామన్నారు. అలాగే రానున్న రబీ సీజన్‌లో రైతులు రెండవ పంటగా వరి పండించవద్దన్నారు. అపరాల పంటలను రైతులు వేసుకోవాలని, ఆరుతడి పంటలుకు ఖర్చు తక్కువై, దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఆరంగి శ్రీనివాసరావు, రైతులుతో పాటు రైతు సేవా కేంద్రం అధికారి, ఝాన్సీ పాల్గొన్నారు.

బాలికలకు చైతన్యం పరచాలి

విశాలాంధ్ర - మందస : మండలంలో గ్రామ సచివాలయాలు పరిధిలో కిషోరి వికాసంపై అంగన్వాడీ కార్యకర్తలు బాలికలకు చైతన్యం చేయాలని మందస అంగన్వాడీ ప్రాజెక్టు అధికారి కె.వసుందరదేవి కోరారు. బుధవారం మందస మండల పరిషత్ కార్యాల యంలో కిషోరి వికాస కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలకు బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, సైబరు క్రైమ్ జరుగుతున్న తీరుపై గ్రామాల్లో వివరించాలని కోరారు. ప్రతీ ఇంటిలో ఉన్న బాలికలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విధంగా కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధ పడుతున్న బాలికలను గుర్తించి ప్రభుత్వాసుపత్రుల ద్వారా వైద్యసేవలు అందే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బాలికా చట్టాలను బాలికలకు తెలియజేసి అవగాహన కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంఇవో లక్ష్మణరావు, మెడికల్ అధికారి సంతోషి, మండల పరిషత్ సూపరిటెండెంట్ రుషికేశ్వర రావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు బి.మంగమ్మ, సి.హెచ్.రామలక్ష్మీ, పి.జయలక్ష్మీలు పాల్గొన్నారు.

'రోణంకి'కి ఘనంగా స్వాగతం పలికిన 'కాళింగ సంక్షేమ సంఘం'



విశాలాంధ్ర - నరసన్నపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్, అడ్వకేట్, రోణంకి కృష్ణం నాయుడుకు బుధవారం నరసన్నపేట కాళింగ సంక్షేమ సంఘం ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం విజయ వాడలోని గొల్లపూడిలో బి.సి భవన్‌లో చైర్మన్‌గా పదవీ ప్రమాణం చేసిన కృష్ణంనాయుడు, బుధవారం నరసన్నపేట విచ్చేసిన సందర్భంగా స్థానిక శ్రీ పైడితల్లి అమ్మవారు ఆలయం వద్దకు అధిక సంఖ్యలో కాళింగ సంక్షేమ సంఘ కుటుంబ సభ్యులు చేరుకున్నారు. అనంతరం శ్రీ పైడితల్లి ఆలయానికి చేరుకున్న కృష్ణంనాయుడుకు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలి కిన కాళింగ కుటుంబ సభ్యులు, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఆ తర్వాత ఆలయం నుండి చైర్మన్, కృష్ణం నాయు డుకు బైక్ ర్యాలీతో తన ఇంటి వరకూ వెళ్ళారు. ఈ సందర్భంగా చైర్మన్, కృష్ణంనాయుడు మాట్లా డుతూ నాకు ఇంతగా గౌరవించిన ప్రతీ కుటుంబ సభ్యులకు హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కాళింగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు, ప్రముఖ వై ద్యులు, డా.బలగ మురళీ, మార్పు విజయ్ కు మార్, అధ్యక్షులు, ఉప్పాడ పూర్ణరావు, ఉపా ధ్యాక్షులు, సింగూరు శ్రీనివాసరావు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడిని కలిసిన కళాకారుల ప్రతినిధి

విశాలాంధ్ర - కొత్తూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ నూతనముగా చైర్మన్ గా నియమితులయిన గుమ్మడి గోపాలకృష్ణ ప్రమాణ స్వీకార కార్యక్రమంనకు మండలం గూనభద్ర గ్రామానికి చెందిన కళా కారులు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుల అంపిలి ప్రశాంత్ కుమార్ పాల్గొని. ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్‌ని కలిశారు. ప్రస్తుతం కళాకారులు యొక్క సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించి కళాకారులను ప్రభుత్వం తరపున ప్రదర్శనలను ఇప్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని వినతిని సమర్పించారు.

48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - లావేరు/రణస్థలం : రైతులు ధాన్యం అమ్మకం చేసిన 48 గంటల్లో వారి ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో లావేరు మండల హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. మద్దతు ధర టన్ను కు 117 రూపాయలు పెంచిందని, ధాన్యం అమ్మకం చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు చేసే వారు లేక రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. రైతుకు నచ్చిన మిల్లుకు తీసుకుని వెళ్ళేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, పిన్నింటి మధుబాబు, తోటయ్య దొర, లకులాపు అప్పలనాయుడు, రాజా వంతుల ప్రకాష్ రావు, మీసాల వెంకట రమణ, త్రినాధరావు, జనసేన దుర్గారావు, పీఎసీఎస్ స్పెషల్ ఆఫీసర్, మండల తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిన్ను ఎందుకు సస్పెండ్ చేయకూడదు

- గన్నీలు మిల్లర్లకు ఎందుకు అందించలేదు
- శిక్షణ లేని కస్టోడియన్
- ట్రక్ షీట్‌లో వున్న వాహనం మార్పుపై ఆగ్రహం
- సివిల్ సప్లై ఎం.డి మంజీర్ జిలాని సామూన్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ధాన్యం కొనుగోలు కేంద్రాలు నుంచి మిల్లర్లకు వెళ్లే ట్రక్కు షీట్ మార్పులపై పౌరసరఫరాల ఎఎన్ టెక్నికల్ శ్రీనివాసరావు నిర్వహణ తీరు, మిల్లర్లకు ఇప్పటి వరకు గన్నీలు అందించకపోవడంపై రాష్ట్ర సివిల్ సప్లై ఎం.డి మంజీర్ జిలాని సామూన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సుందర్ రైస్ మిల్ తనిఖీలో భాగంగా కస్టోడియన్లకు శిక్షణ అందించలేదని, మిల్లర్లకు గన్నీలు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలే దు నిన్ను (ఏ ఎన్ టెక్నికల్ శ్రీనివాసరావు) ఎందు కు విధులు నుంచి సస్పెండ్ చేయకూడదు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రా లను వద్ద నుంచి మిల్లర్లకు చేరేవరకు, అక్కడ నుం చి మిల్లింగ్ అయిన బియ్యం సంబంధిత పౌరసర ఫరాల శాఖకు అందే వరకు తీసుకోవలసిన జాగ్రత్త లపై కస్టోడియన్ కు ఎందుకు శిక్షణ ఇవ్వలేదని నిలదీశారు. తనిఖీలో భాగంగా కస్టోడియన్ వి ఆర్‌ఓ అప్పారావు వాహనం ఒకటి ట్రక్ షీట్ వేరొ కటి నమోదు చేయడంపై ప్రశ్నించగా తనకు ఇదే మొదటిసారి అని ధాన్యం కొనుగోలులో తనకు అవగాహన లేదని తెలిపారు. పౌర సంబంధాల శాఖ డిఎం గా పనిచేసిన శ్రీనివాసరావు స్థాయి తగ్గడంతో కనీసం ఏ ఒక్క కస్టోడియనికి శిక్షణ అందించలేదని నెలరోజుల క్రితం జరిగిన సమీక్షలో ఆయన వ్యవహార శైలిపై డి ఎం హెచ్చరించినట్లు అయినప్పటికీ ఆయన తీరు మారలేదని ఇంకో సారి ఇటువంటి తప్పు జరిగితే సస్పెండ్ చేస్తామని డి ఎం పేర్కొన్నారు. మరి టెక్నికల్ అధికారులు శిక్షణ ఇవ్వలేదా అంటే అటువంటి శిక్షణ మాకు అందలేదని ఎండి ముందే చెప్పడంతో ఆగ్రహం చెందిన జిలాని శ్రీనివాసరావుని ఎందుకు సస్పెండ్ చేయకూడదు వివరించాలన్నారు. మిల్లర్లకు రైస్ గన్ని ఎందుకు ఇవ్వలేదని తక్షణమే వాటిని అందించాలన్నారు. దాన్యం సేకరించిన వెంటనే మిల్లింగ్ చేసి బియ్యం ఎఫ్ సి కి పంపించాలని మిల్లర్ రమేష్ కు తెలిపారు. ఎటువంటి జాప్యం జరిగిన ట్రక్ షీట్ నమోదులో అక్రమాలు జరిగిన మిల్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతుకు ఉపయోగపడేలా రైతు సేవా కేంద్రాల సిబ్బంది వ్యవహరించాలన్నారు. ముందుగా జొన్నవలస సచివాలయాన్ని పరిశీలించారు. అక్కడ రైతు సేవా కేంద్రంలో వ్యవహరిస్తున్న తీరు ను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్, సివిల్ సప్లై డిఎం వేణు గోపాల్, ఎమ్మార్వో రాంబాబు, ఏవో మోహన్ రావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

7న తల్లిదండ్రుల మెగా సమావేశం

విశాలాంధ్ర - మందస : మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఇవో లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టబోయే మెగా సమావేశానికి సర్వం సిద్ధమైనట్లు తెలిపారు.

రైతన్నకు అండ దండగా ఉండే ప్రభుత్వం ఎన్డీఏ కూటమి

పైడి భీమవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : మండలం ఆరుగాలం శ్రమించి దుక్కి దున్ని నారు పోసి నీరు పెట్టి కోత కోసి కుప్పలూడ్చి వరి ధాన్యం అమ్మకానికి ఎదురుచూసే రైతన్నకు మద్దతు ధర పెంచి, నచ్చిన మిల్లులో రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకునేలా, రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేలా, రైతులకు చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పైడి భీమవరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌గా కొరికాన రవికుమార్ నేడు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం అర్బన్ డవలప్మెంట్ అథారిటీ (సూడా) చైర్మెన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు కొరికాన రవి కుమార్ నేడు అనగా గురువారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్య్ర కమానికి కూటమి ప్రభుత్వ నాయకులు, జనసేన నాయకులు, భారీ ఏర్పాట్లు చేశారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కూటమి నాయకులు తరలిరానున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా జనసేన అధ్యక్షులు పిసినీ చంద్రమోహన్, నియోజక వర్గ ఇన్చార్జిలు ఏర్పాట్లు దగ్గరుండి చూస్తున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాసరావు, గుమ్మడి సంధ్యరాణితో పాటు జిల్లా లోని శాసన సభ్యులు అందరూ హాజరు కానున్నారు. రవికుమార్ అభిమానులు, జన సైనికులు భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకొనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి కమ్మనైన వంటలతో విందు ఏర్పాటు చేశారు. 12 రకాల వంటలతో అతిధులకు భోజనాన్ని పెట్టనున్నారు.

సస్య రక్షణ చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర - పలాస : ఉద్దానం ప్రాంత రైతులు జీడి, మామిడి,పనస,మునగ, కొబ్బరి వంటి పంటలపై సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి పోలారావు అ న్నారు. బుధవారం మండలం బొడ్డపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది మహోత్సవం భాగంగా రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంటల సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా అధిక ఆదాయం వచ్చే రకాలు మరియు వ్యవసాయ పనిముట్ల రాయితీ కోసం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్.వో.శంకర్ దాసు, బి.హెచ్.వో.తెప్పల పావని, కిక్కర ఢిల్లీ రావులతో పాటు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

తెలుగు జాతీయ దినపత్రిక

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు శ్రీకాకుళం జిల్లాలో ఈ క్రింది తెలుపుపిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.

కావాల్సిన ప్రాంతాలు :

సంప్రదించవలసిన నెం :

సనపల రమేష్, జిల్లా బ్యూరో చీఫ్

7569642555

మెగా తల్లిదండ్రుల సమావేశానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పొందూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడివలసలో డిసెంబర్ 7వ తేదీ శనివారం జరుగనున్న మెగా పేరెంట్స్ సమావేశానికి 1990 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య ను పూర్వ విద్యార్థులు పైడి సూరిబాబు, పప్పల రమణమూర్తి, పూజారి హరిప్రసన్న తదితరులు కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ మెగా సమావేశానికి తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, దాతలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారందరికీ పండుగ వాతావరణంలో భోజన ఏర్పాట్లు చేయాలని సూచించిన తరుణంలో 1990 లో ఇదే పాఠశాలలో పదవ తరగతి చదుకున్న వీరంతా తక్షణమే స్పందించి ఈ ఆర్థిక సహాయాన్ని అందించారని ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్, పాఠశాల సెక్రటరీ పెద్దిన రాంబాబు పాల్గొన్నారు.

కిషోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర - నరసన్నపేట : కిషోర బాలికల్లో రక్తహీనత లేకుండా ఒక వైపు తల్లి తండ్రులు, మరో వైపు అంగన్వాడీ సిబ్బంది చూడాలని ఎం.పి.డి.వో, బొడ్డేపల్లి మధుసూధనరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సమావేశ మందిరంలో సి.డి.పి.ఓ, కె.నాగమణి ఆధ్వర్యంలో కిషోర వికాశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎంపిడివో, మధుసూధనరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆగస్టు, 15వ తేది, 1997వ సంవత్సరంలో బాలికల అభివృద్ధి, బాలికల సాధికారతకై ప్రారంభించిందని తెలిపారు. అలాగే బాలికలకు జన్మనిచ్చిన వివక్షతను పూర్తిగా తొలగించాలని, బాలికల నమోదు శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలికల్లో బాల్య వివాహాలు తగ్గించేలా చర్యలు తీసుకోవటమే కాక, బాలికల తల్లితండ్రుల ఆర్థికస్థితి మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, పి.దాలినాయుడు, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి, డా.సుజాత, ఈవోపిఆర్డి, రేణుక, సూపర్వైజర్లు, రమణమ్మ, నిర్మల, దుర్గమ్మ, స్రవంతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణా ను అరికడదాం

విశాలాంధ్ర - హిరమండలం : బాలికల అక్రమ రవాణా ను మనమందరం అరికట్టాలని ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు, జడ్పీటీసీ పి.బుచ్చిబాబులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, మహిళా పోలీస్లతో కిశోరి వికాసం అనే మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11-18 సంత్సరాలులోపు అమ్మాయిలు సెల్ ఫోన్కు చాలా దూరంగా ఉంచాలని అమ్మాయిలను అక్రమ రవాణా చేసి వేశ్య వృత్తులులోకి దించుతున్నారని, 18 సంత్సరాలు నిండకుండానే అమ్మాయిలకు పెళ్లి చేస్తున్నారని, 18సంత్సరాలు నిండిన వరకు చదివనివ్వాలని, సెల్ ఫోన్లు యందు అమ్మాయిలు భద్రం గా ఉండాలని ఈ విషయాలు అన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలనీ కోరారు. కొంత మంది మహిళలు గృహ హింసను ఎదుర్కొంటున్నారని పోలీస్లను ఆశ్రాయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వైద్యధికారి సి హెచ్ సాయి గీత, యు.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎయిర్ పోర్ట్ వద్దు.. ఉద్దానం ఉసురు తీయొద్దు...!

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : ఉద్దానం ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ నిర్మించి తమ ఉసురు తీయొద్దంటూ... వజ్రపుకొత్తూరు మండలం వంకులూ రుకు చెందిన ఆది బలిజ కులం సంఘం నాయకులు ముక్తకంఠంతో కోరారు. బుధవారం గ్రామంలో ఎయిర్ పోర్ట్ వద్దు అంటూ ఆది కుల బలిజ సంఘం ఆధ్వర్యంలో పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు అనంతరం కుల పెద్దలు మాట్లాడుతూ తమ జీవనాధారం అయిన భూములను తీసుకుంటే ప్రాణ త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు ఎయిర్ పోర్ట్ కు స్థలము కావాలంటే వేరే దగ్గర చూసుకోవాలని అన్నారు. ఉద్దానంలో జీడి మామిడి పంటల మీద ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనము గడుపుతున్నారని అటువంటి రైతులు జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి సూచించారు. ఎయిర్ పోర్ట్ వల్ల మాకు వచ్చే లాభాలైతే ఏమీ లేవని నష్టమే తప్ప ప్రభుత్వం దీనిపై ఆలోచించి రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ బర్రి వాని పేట చిన్న వంకలూరు చెందిన రైతులు మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐతమ్లో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఐటి రూర్కెలా సౌజన్యంతో రెండు రోజుల పాటు ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంటిలిజెంట్ మేనిఫేక్చరింగ్ సిస్టమ్స్(ఐసిఐపిడిఐఎంఎస్) అనే అంశంపై నిర్వహించే సదస్సును జెఎన్టియు జీవి అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు బుదవారం ముఖ్య అతిధిగా పాల్గొని,జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనలను పంచుకోడానికి ఇటువంటి వేదికలు దోహదపడతాయన్నారు. మానవ మేదస్సును రిజిస్ట్రేషన్ చేయడంలో అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో పోల్చితే భారత్ వెనుకడుగులో ఉందని కేవలం ఉద్యోగం లేదా ప్రమోషన్లకు తగినట్టుగా జర్నల్స్లో ప్రచురితం చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. ల్యాబులను సమాజంలోని సమస్యల పరిష్కారానికి వినియోగించాలని ఆయన సూచించారు. ఒకరి వద్ద పనిచేసే వారుగా కాకుండా పది మందికి ఉద్యోగాలు ఇచ్చేవారుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. డైరెక్టర్ ప్రొఫెసర్వి వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ రంగంలో రోబోల ఆవస్యకత పెరుగుతుందన్నారు. నేటి ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. వీటిపై నిరంతరం పరిశోధనలు జరగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు,కన్వీనర్, సిఎస్ఈ హెచ్డి డాక్టర్ వై.రమేష్లు సదస్సు ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయంగా 16 మంచి ఆలోచనలు వచ్చాయని వాటిలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన 50 పేపర్లను గుర్తించామన్నారు. ఈ సదస్సులో డీన్లు, హెచ్ డిలు, సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.జయంతిరావు, పరిశోధన చేసే విద్యార్థులు పాల్గొన్నారు.

వరికి మొలకెత్తిన మొక్కలు..రైతు కళ్ళల్లో కన్నీటి చుక్కలు

విశాలాంధ్ర - పొందూరు : జిల్లాలో ఫెంగల్ తుఫాన్ బీభత్సం రైతాంగాం పాలిట ఓ శాపంగా మారింది. వరి కోతల సమయంలోనే తుఫాన్ తాకిడికి వరి ఓవులు తడిచి ముద్దవ్వడంతో వరి గింజల మొలకెత్తాయి, వరిఓవు కళ్ల చూసిన రైతు కళ్ళల్లో కన్నీటి చుక్కలు కారుతున్నాయి. ధాన్యరాసుల చూసి రైతు సంబర పడే దశలో ఉండవలసిన సమయంలో కన్నీరు మున్నీరై కలత చెందుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి ఏప్పుడు ఎలా తీర్చాలా అంటూ ఇంటిల్లాపాటీ ఎన్నాళ్ళ కష్టపడితే తీరుతాయా అంటూ లబోదిబోమంటున్నారు. పండగపూట ఆడపిల్ల పిలుపులకు నోచుకోలేని పరిస్థితి తుఫాన్ తెచ్చిపెట్టిందని రైతు ఇంట మహిళలు కరువు గోష పెడుతున్నారు. తడిచిన ధాన్యం సర్కారు కొనుగోలు చేస్తే కానీ మా బాధలు తీరవంటూ కలత చెందుతున్నారు. దళారోళ్ళ చేతికి ధాన్యమిస్తే మొలకెత్తిన వరి మాకో ద్దంటూ తులగ్రిస్తున్నారని బాధపడుతున్నారు. కరువు కాలం కమ్ముకొస్తున్న ఈ తరుణంలో సర్కారు దిగివచ్చి చేయూతనివ్వకపోతే అప్పులు తీర్చడానికి వలస బతుకులు తప్పవని చెప్పుకుంటున్నారు. ఉన్న ఊరిని విడవలేక,పస్తులతో పడి ఉండలేక, పిల్ల పాపలతో సహితం వలస పక్షుల పనులు చేసుకోపోతే అప్పులోడికి వడ్డీలు ఎలా కడుతామని భయపడుతున్నారు.తడిసే ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాకపోతే కన్నతల్లి లాంటి ఉన్న ఊరిని, వృద్ధాప్యంలో ఉన్న అవ్వ తాతలను వెంటేసుకుని వలస తప్పదంటూ బాధపడుతున్నారు. తడిచే ధాన్యాన్ని కిట్టుబాటు ధరలతో సర్కారు కొనుగోలు చేయాలని ప్రాధేయపడుతున్నారు.

నూతన ఎస్ఐ రవివర్మను కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు చేపట్టిన రవివర్మకు పలువురు వైసిపి నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ మేరకు బుధవారం వైసీపీ నేతలు బెందాళం జయప్రకాశ్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, సర్పంచ్ ప్రతినిధి దేవరాజసాహు, ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, మండల కో ఆప్షన్ సభ్యులు సభ్యులు పాండవ చంద్రశేఖర్, దువ్వు కృష్ణారెడ్డి, జల్లు యుగంధర్, బి.భాస్కర్, జే.నరేష్, వై.సత్యం, శివ బిసాయిలు ఎస్సై రవివర్మను కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.

రైతు వ్యతిరేక చర్యలు వద్దు

విశాలాంధ్ర - మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని మందస మండల మహేంద్ర రైతు సంఘం అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. పలాస నియోజకవర్గ పరిధిలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉద్దాన ప్రాంతంలోని రైతాంగం జీవనాధార భూములైన జీడి, కొబ్బరి తోటల్లో కార్గో ఎయిర్పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం గుర్తించడం పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. 1400 ఎకరాల ఉద్దాన ప్రాంతంలో భూములు విమానాశ్రయం కోసం గుర్తించడం పట్ల ఆయన తీవ్రంగా విమర్శించారు. ఉద్దాన రైతులకు ప్రధాన జీవనాధారమైన భూములకు ప్రభుత్వం గుర్తించడం పట్ల రైతాంగం రోడ్డున పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఇటువంటి ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.

బీజేపీ సభ్యత్వాల్లో పాతపట్నం టాప్

విశాలాంధ్ర - కొత్తూరు : శ్రీకాకుళం జిల్లాలో బీజేపీ పార్టీ సభ్యత్వాలు అత్యధికంగా పాతపట్నం నియోజీ.క వర్గంలో నమోదు చేయించిన ఆపార్టీ పాతపట్నం నేత సిరిపురం తేజేశ్వరరావును బీజేపీ పెద్దలు అభినందించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో ఆయన్ను అభినందించి సత్కరించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్ రాజు, జిల్లా బీజేపీ ఇంచార్జి విజయానంద రెడ్డిలు తేజేశ్వరరావును సత్కరించారు. ఇదే విధంగా ముందుకు సాగాలని కోరారు

రేషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - కంచిలి : ప్రజా పంపిణీ కార్యక్రమంపై కంచిలి తహశీల్దార్ ఎన్.రమేష్కుమార్ ప్రత్యేకదృష్టి సారించారు. రేషన్ పంపిణీ జరుగుతున్న తీరు, ఇతరత్రా అంశాలపై బుధవారం కంచిలిలో ప్రత్యక్ష పరిశీలన చేశారు. సిఎస్డిటి పైడి కూర్మా రావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వయంగా తనిఖీలు నిర్వహించారు. రేషన్ పంపిణీ విధానంపై వినియోగ దారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే రెవెన్యూ సిబ్బంది సంప్రదించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మందస : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసు కోవాలని మందస తహసీల్దార్ ఎస్.హైమావతి అన్నారు. బుధవారం సచివాలయం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13 క్లస్టర్ల పరిధిలో రైతులు ధాన్యాన్ని కేజీ 23 రూపాయలు చొప్పున్న ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మండలంలోని మిల్లులు బ్యాంకు గ్యారంటీలు సత్వరమే చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఉదయ్ సహకార బ్యాంకు సీఈఓ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు బలిగాం కో ఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షులు బమ్మిడి కర్రెయ్య మందస మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ దుంకురు తిరుపతి హంసరాలి మాజీ సర్పంచ్ తమిరి భాస్కర రావు పిడిమందస ఎంపీటీసీ సభ్యులు వాయిలపల్లి మాధవరావు బైరిశెట్టి గున్నయ్య రాజాన మహేష్ మంగళ పాత్రో సాలిన భీమారావు ప్రకాష్ పాణిగ్రహీ పల్లి చంద్రయ్య కొర్రాయి శ్రీను నారాయణ రావు రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్లో హిందువుల మీద దాడులు అపాలి

హిందువుల సమైక్య నిరసన నిరసన ర్యాలీ భారీగా పాల్గొన్న ప్రజలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : బంగ్లాదేశ్ లో హిందువుల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని పలువురు కోరారు. హిందూ సమాజం ఆద్వర్యం లో బుధవారం హిందువుల సమైక్య ర్యాలీ నీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి కి రాసిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ లో అందించారు. ఈ సందర్భంగా హిందూ సమాజం తరుపున పారానంది వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బుధవారం పెద్ద ఎత్తున హిందువులు నిరసన, ధర్నాలు చేశారన్నారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని లేకుంటే హిందూ సమాజం వారికి తగిన బుద్ధి చెబుతుందని వ్యాఖ్యానించారు. దుంగ రమణ మూర్తి మాట్లాడుతూ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయినప్పటి నుండి నేటి వరకు భారత్ అనేక విధాలుగా ఆర్థికంగా సహకరిస్తూ వచ్చిందనీ, వేలాది కోట్లు సాయం చేసిందన్నారు. వారికి ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడంలో ఎందరో భారతీయులు అనేక త్యాగాలు చేశారనీ, అలాంటిది హిందువులపై ఇలాంటి పిరికిబంద చర్యలు వారికి తగదని ఆయన హితవు పలికారు. బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఢాకాలోని తంతియాలో పూజా మండపం పై దాడులు చేసారనీ, జేశోరేశ్వరీ కాళీ మాత ఆలయంలో కిరీటం అపహరించారన్నారు. ఇలాంటి చర్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిగా భారతీయ హిందూ సమాజం ఆందోళన చెందుతోందని అన్నారు. భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ లో ఉన్న హిందువులుతో పాటు మైనార్టీలు, ప్రజలు అందరినీ సంరక్షించాల్సిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పడం జరిగిందని అయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో లోకనాథం, లింగరాజు, మాధవ్, పద్మజ, పూడి తిరుపతి రావు, పైడి వేణుగోపాల రావు, శవ్వాన ఉమామహేశ్వరి, గోపీ, సూర్యకుమారి, రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, కిరణ్, ఉమామహేశ్వరి రెడ్డి, మధుసూదన్, పెద్ద ఎత్తున హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఆ మిల్లుకు అనుమతి ఎలా ఇస్తారు ..?

విశాలాంధ్ర - కంచిలి : మండలం సిర్తలి గ్రామంలో లో ఉన్న జె ఎస్ కే ఎంటర్ప్రిజెఎస్ కేరఫ్ కంచమ్మ తల్లి మొడ్రాన్ రైస్ మిల్లుకి ఎలా అనుమతి ఇస్తారు అని పలువురు వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయం లో వినతిపత్రం ఇచ్చారు. ఈ లేఖలో గత ఐదు సంత్సరాలుగా రైతులు ఇబ్బంది పడుతున్నారు అని ఈ మిల్లులో సార్టేక్స్ గాని ఫోర్డ్ ఫైడ్ మిషన్లు గాని అమర్చలేదు గతంలో రైతులకు ఇవ్వవల్సిన డబ్బులు ఇంత వరకు ఇవ్వలేదని అలానే ఒరిస్సా నుండి ధాన్యం కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధర కి విక్రయిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అలానే గత ప్రభుత్వం 1632 రూపాయలను నిర్ణయిస్తే మిల్లు యజమాని వేరే వ్యక్తి తో కలిసి 1200 రూపాయలు నుండి 1400 రూపాయలకు కొనుగోలు చేసి అధిక ధర కి విక్రయం చేసారని అలాంటి మిల్లు ని మరల ఎలా అనుమతి ఇస్తారని పలువురు వ్యక్తులు తాశిల్దార్ కి వినతిపత్రం అందజేశారు.

సేవలే గుర్తింపునిస్తాయి : విశ్రాంతి ఉద్యోగికి గ్రామంలో ఘన సత్కారం

విశాలాంధ్ర - కవిటి : ఉద్యోగి తన విధి నిర్వహణలో చేసిన సేవలే వారికి గుర్తింపు నిస్తాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బొరివంక గ్రామానికి చెందిన పంచాయతీ రాజ్ ఇంజనీర్ భగీరది దొలాయి. ఇచ్ఛాపురం మండలంలో పని చేస్తూ గత నెల 30న పదవీ విరమణ చేయడం జరిగింది. ఆయన్ను ఎమ్మెల్సీ రామారావు, మండలంలోని ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్,ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,వైఎస్ ఎంపిపి పూడి నేతాజీ,సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, మాజీ పిఏస్సిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు,ఇప్పిలి కృష్ణారావు, గెస్ట్ అధ్యక్షులు బల్లెడ శంకర్రావు, ఎంపీటీసీ దుద్ది.సతీష్, బొరివంక యూతక్లబ్ సభ్యులు దీనబంద్, బెంతొరియా కుల పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి : ప్రొఫెసర్ కేఆర్ రజని

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : క్రీడల్లో గుర్తింపు పొందడం ద్వారా వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు) లో ఇటీవల జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు క్రీడాకారిణిలను బుధవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలోనే తొలిసారి డి. హేమశ్రీ (విద్యాధరి డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం) బంగారం పతకం సాధించడం అభినందనీయమన్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్లో త్వరలో జరగనున్న వెయిట్ లిఫ్టింగ్ పాల్గొనేందుకు అర్హత సాధించిన జి.వర్షిత (శారద డి గ్రీ కళాశాల, శ్రీకాకుళం), ఎస్.ఝాన్సీలక్ష్మి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి)లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ. భాస్కర్, కోచ్ ఐ.అప్పన్న పాల్గొన్నారు.

జమ్మూ ఐఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా 'పైడి'

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణంలోని రెండవ వార్డ్ కృష్ణా పురానికి చెందిన పైడి అనిల్ కుమార్ జమ్మూ లోని ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎంపిక య్యారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాం విభాగానికి అనిల్ కుమార్ ఎంపికయ్యారు. ఈయన ప్రాథమిక విద్య వెన్నెల వలసలోని నవోదయ విద్యాలయం లో కొనసా గింది. ఐఐటి మద్రాస్ లో కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్డీ చేశారు. అనిల్ సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీలో పోస్ట్ డాక్టరల్ రీ చర్చ్ చేశారు. సౌత్ కొరియాలో లిథియం మరియు సోడియం బ్యాటరీ డెవలప్మెం ట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. అనీల్ కుమార్ తల్లిదండ్రులు పైడి నారాయణమూర్తి, వెంకట సత్యవతి సాధారణ కుటుంబీకులు. నారాయణ మూర్తి ఆముదాలవలసలో అనిల్ సప్లయర్స్ నడుపుతున్నారు. అనిల్ భార్య పైడి ఉషారాణి గృహిణి. అనిల్ ఎంపిక పట్ల పట్టణంలోని పలు వురు అభినందనలు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

విశాలాంధ్ర - నందిగాం : మండలం తురకలకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొండాల నికిత అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎంఈఓ జి.నరసింహులు తెలిపారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నికితను గత ఐదు రోజుల కిందట తల్లిదండ్రులైన మల్లేశ్వర రావు లక్ష్మీ విశాఖపట్నం కెజిహెచ్కి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినీ నికిత స్వగ్రామమైన తురకల కోటలో విషాదఛాయలు నెలకొన్నాయి.

విద్యుత్ చార్జీలు బాదుడే.. బాదుడు..

అధిక చార్జీలతో ఆందోళనలో వినియోగదారుడు..!

విశాలాంధ్ర - పలాస/మందస : విద్యుత్ ఛార్జీలు సర్దుబాటు పేరుతో ప్రతి నెల అధిక విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం పెంచడంతో విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలల నుండి ప్రతినెల విద్యుత్ చార్జీలను ప్రభుత్వం పెంచి పేద ప్రజలకు కష్టాలు పాలు చేసే పరిస్థితి ఏర్పరిచారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధిక విద్యుత్ ఛార్జీలు ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బాదుడే...బాదుడు కార్యక్రమాన్ని చేపట్టింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంపుదల ఉండదని, ప్రజలపై భారం మోపేదిలేదని కూటమిలోని భాగస్వామ్య పార్టీలు ప్రకటించాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెల విద్యుత్ చార్జీలు పెంపుదల చేస్తుండటం పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. గృహ వినియోగదారులైన పేద, బడుగు వర్గాలు విద్యుత్ చార్జీలు చెల్లించుకోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో ఇంకా ప్రతి నెల 2026 వరకు విద్యుత్ చార్జీలు

సర్దుబాటు పేరుతో పెంపుదల ఉండడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంపుదల ఉండదని హామీలు ఇచ్చి ఇప్పుడు ఇష్టారాజ్యంగా విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ప్రజల్లో వ్యతిరేకత భావం చోటు చేసుకునే చర్యలకు కూటమి ప్రభుత్వమే ఒడిగడుతున్న భావన ప్రజల్లో ఉంది. విద్యుత్ చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపడంతో పాటు స్మార్ట్ విద్యుత్ మీటర్లు కేటగిరి టు(11) విద్యుత్ వినియోగదారుల గృహ సముదాయాలకు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉపక్రమించింది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ వాడకం కోసం వినియోగదారుడు రీఛార్జ్ చేయవలసి ఉండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలను, చిరు వ్యాపారులను ఇబ్బందులు పాల్జేసే విధానం అవలంబిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే విద్యుత్ శాఖలో తాత్కాలిక ప్రాతిపదికగా పనిచేస్తున్న రాష్ట్ర వ్యాప్తంగా బిల్ రీడర్స్ జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. నిరుద్యోగులైన బిల్లు రీడర్స్ ప్రభుత్వం తీసుకుంటున్న ఆలోచనలతో ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల గృహ సముదాయాలకు, వ్యాపార సంస్థల యొక్క విద్యుత్ బిల్లులను రీడర్స్ తీస్తుంటారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వలన సామాన్య ప్రజలు చిరు వ్యాపారులు కష్టాలు అనుభవించడమే కాకుండా నిరుద్యోగులైన బిల్లు రీడర్స్ జీవనోపాధి కోల్పోయి వారి కుటుంబాలు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతున్నాయి. అధిక విద్యుత్ చార్జీలకు తోడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు వామపక్షాలు కూటమి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకిస్తున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పై పునరాలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : విద్యుత్ లైన్లకు అడ్డంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు, ఇతర మరమ్మతుల కోసం ఎచ్చెర్లలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫరీద్పేట ఫీడర్, ఫరీదొపేట, లింగాలపేట, ఎస్ఎంపురం గ్రామాలకు శుక్రవారం సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందని ఈఈ పి. యోగేశ్వర రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నా మన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుక 0దిటి ఈశ్వరరావు అన్నారు. మండలం ఇబ్రహీంబాద్ గ్రామంలో బుధవారం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్వింటాల్ క్కు కనీస మద్దతు ధర రూ.2,300 పొందాలన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సం మ పథకాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. రైతులకు మినప విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఏడీఏలు భవానీ శంకర్, రజని, తహసిల్దార్ సింహాచలం, ఎంపీడీవో హరిహరరావు. మండల వ్యవసాయాధికారి వై.సురేష్ మండల టీడీపీ అధ్యకుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగి సేవలే గుర్తింపునిస్తాయి

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : విధి నిర్వహణలో ఉద్యోగి అందించిన సేవలే గుర్తింపునిస్తాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞానభవన్ లో బుధవారం ఆర్టీసీ ఉద్యోగి బాషా ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఉద్యోగం అనంతరం శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన శ్రీ కళ్యాణ్కు సత్కారం

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటి సచివాలయం-2 లో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్గా విధులు చేపట్టి ఇటీవల ఏఈఓగా పదోన్నతి పొందిన బెందాళం శ్రీ కళ్యాణ్కు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఈవో వీరభద్ర స్వామి తోపాటు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నాస్ ప్రతిభ పరీక్షలు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని బుధవారం నేషనల్ ఎచీవ్మెంట్ సర్వే ప్రతిభ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ప్రతీ ఏటా ఎస్.సి.ఆర్.టి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలు 3,6,9వ తరగతికి చెందిన విధ్యార్థులకు నిర్వహిస్తారు. మండలంలో ప్రతిభ స్కూల్, విజ్ఞాన్ విద్యా నికేతన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బొర్డు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బొరిగివలస) శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు సుమారు 180మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారి, యు.శాంతారావు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజీ 3
గురువారం 5, డిసెంబర్, 2024

అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి..

విశాలాంధ్ర - టెక్కలి : విద్యాశాఖ అధికారులు అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఉపాధ్యాయుల సమస్యలను కోరుతూ స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు యుటిఎఫ్ కమిటీ సభ్యులు మెమోరాండం సమర్పించారు. అనంతరం యుటిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వ పరిపాలనకు, ఈ ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని అన్నారు. పాఠశాలల పనివేళల పెంపు,10% మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు,10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థులు నమోదు,...ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయని అన్నారు. ముఖ్యంగా మండలాల్లో 10% మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని మండల విద్యాశాఖాధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదుని,అనారోగ్యం బారిన పడినవారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అవుతున్నారుని, ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారని,ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పని చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని, విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలనే డిమాండ్తో ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీయఫ్) రాష్ట్రమంతటా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందిని అందులో భాగంగానే నేడు విద్యాశాఖ అధికారులకు నోటీసులు అందజేశామని తెలిపారు. పై సమస్యలను పరిశీలించి విద్యాశాఖ నిర్ణయాలను పునఃసమీక్షించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారుల నిర్ణయాలు ఉండాలని, లేని యెడల మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పడాల. గణపతి రావు, ప్రధాన కార్యదర్శి తమ్మినాన్న. వైకుంఠరావు, ఎం కుమారస్వామి, దవల వైకుంఠరావు, ఆర్ విజయ్ కుమార్, ఎన్ కృష్ణారావు, జనని శ్రీనివాసరావు, చిన్నవాడు, బాడాన నారాయణరావు తదితరి సభ్యులు పాల్గొన్నారు.

కిషోర్ బాలికలకు అంతా అండగా ఉండాలి : ఎంపీడీవో వెంకట్రావు

విశాలాంధ్ర - ఆమదాలవలస : కిషోర్ బాలల వికాసానికి, విజ్ఞానవంతులను చేయడమే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పని చేయాలని ఎంపీడీవో ఆర్ వెంకట్రావు అన్నారు. కిషోర్ వికాసం 2 మండల స్థాయి శిక్షణ కార్య క్రమం లో భాగంగా ఆమదాలవలస ఎంపిడిఓ కార్యాలయంలో లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా సమా జంలో బాలలపై చూపించే ప్రభావాలను క్షేత్ర స్థాయిలో వివరించాలన్నారు. కిషోర్ బాలికల చదువు, ఆరోగ్యం, రుతుక్రమ పరిశు భ్రత, అక్రమ రవాణా, స్వీయరక్షణ, ఫోక్సో యాక్ట్ బాల్యవి వాహాల నిరోధక చట్టం, యోగ , సైబర్ నేరాలు వంటి అంశాలపై గ్రామ స్థాయి రిసోర్స్ గ్రూప్ మెంబెర్స్ కి అవగాహన కల్పించారు. 11 అంశాలపై వైద్యాధికారులు, అధ్యాపక ఎక్స్పర్ట్, ఉపా ధ్యాయులు, ఔట్రిచ్ అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ అంశాలను క్షేత్రస్థాయిలో వివరించి చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమం ఎంఈఓ రాజేంద్రప్రసాద్ టింగరాజు, ఏపీఎం మెడికల్ ఆఫీసర్లు స్రవంతి, ఐసిపిఎస్ శ్రీనివా సరావు, కళాశాల అధ్యాపకుల పుష్పలత, ఎస్ జి టి సంతోష్ కుమార్ ఈవోపీఆర్డి గోపాలరావు సిడి పిఓ మరియు ఐసీడీఎస్ సూపర్వైజర్లు లక్ష్మి,లీలా రాణి, సచివాలయం మహిళా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ లు, ఏ ఎన్ ఎం లు అంగన్వాడి కార్యకర్తలు మండల స్థాయి శిక్షణ లో పాల్గొన్నారు.

వీఆర్వోపై భౌతిక దాడిని ఖండిస్తూ హోరెత్తిన నినాదాలతో దద్దరిల్లిన నిరసన

విశాలాంధ్ర - పొందూరు : తోలాపి సచివాలయంలో వీఆర్వో మాసాడ దివాకర్ (రేవతిరావు)పై భౌతిక దాడితో పాటు సచివాలయంలో ఉన్న కంప్యూటర్ను ధ్వంసం చేయడం పట్ల నిరసనగా మండల రెవెన్యూ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలను ధరించి, రెవెన్యూ ఉద్యోగ సంఘాలు నిరసనను హెూరెత్తించారు.దాడికి పాల్పడిన పప్పల రామినాయుడు పై తక్షణ చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. గ్రామాల్లో ఉద్యోగులపై దాదాయిజం రౌడీయిజం చెలాయిస్తే విధులు నిర్వహించలేమని తేల్చి చెప్పారు. దాడికి గురైన విఆర్ఓ కు తామంతా అండగా ఉంటామని తాసిల్దార్ వెంకటేశ్వర రామానుజులు హామీ ఇచ్చారు. తోలాపి సచివాలయంలో కంప్యూటర్ ధ్వంశం చేయడమే కాకుండా వీఆర్వో పై భౌతిక దాడి చేయడం పట్ల వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ స్థానిక ఎంపీడీవో మన్మధ రావుపై మండిపడ్డారు.తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించడంతో, అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నేటి యువతపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది

విశాలాంధ్ర - టెక్కలి : నేటి యువతపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని భారతీదేవి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం ఆధ్వర్యంలో బుధవారం క్యాలెండర్ బ్రోచర్ ని పరమేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నిరుద్యోగ జీవితాలతో చలగాటం ఆడుతున్నాయని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని, మానవ వనరుల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, ట్రైనింగ్ టీచర్స్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తగిన చర్యలను ప్రభుత్వం చేపడుగుతుందని, అందులో భాగంగా 'సంకల్పం' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిర్వహించడం జరుగుతుందని పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు అన్నారు. బుధవారం 16వ వార్డు పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగుతుందని, దాన్ని కట్టడి చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ఇటీవల కాలంలో సైబర్ నేరాల తీవ్రత పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకుల పేర్లు చెప్పి వివరాలు రాబట్టుకుని సొమ్ములు దోచుకుంటారని, ఏ.టి.ఎం.ల వద్ద కాపుకాచి నగదు ఉపసంహరించే ఖాతాదారులకు సహాయపడుతున్నట్లు నమ్మించి మోసం చేస్తారని అన్నారు. లోన్ యాప్‌ల ద్వారా డబ్బులు వస్తాయనుకుంటే అంతకు మించిన సమస్యలు వస్తాయని, మొబైల్ ద్వారా కుటుంభ వివరాలు సేకరించి అశ్లీల చిత్రాలుగా మార్చి హింసిస్తారని అవగాహన కల్పించారు. 16వ వార్డు ఇన్‌ఛార్జి నాగరాజ్ పాత్రో తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ధాన్యం కొనుగోలు పూర్తి పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్మోహన్ రావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయాధికారి భార్గవితో కలిసి వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం కోనుగోలు సమయంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సిబ్బంది చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు పాటించాల్సిన జాగ్రత్తలు, అవసరమైన స్టేషనరీ, ప్రింటింగ్ సౌలభ్యం, వాహనాలకు జి.పి.ఎస్ పరికరాలు అమర్చే అంశాలను పరిశీలించి అందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాంకేతిక సిబ్బంది వాహనాలకు జి.పి.ఎస్ పరికారాలు అనుసంధానించడానికి గురువారం వస్తుండటంతో, వాహనాలు సిద్ధం చేయాలని సిబందికి ఆదేశించారు.

రోడ్లపై పశువులు విడిస్తే గోశాలకు తరలింపు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : పట్టణంలో పశువుల యజమానుల నిర్లక్ష్యంతో చాలా వరకు పశువులు రోడ్లపైనే ఉంటున్నాయని, దాంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇకపై గోవుల యజమానులు రోడ్లపైకి విడిచి పెడితే పట్టుకుని సింహాచలం తదితర గోశాలలకు తరలించడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ అన్నారు.

విశాలాంధ్ర సేవలు గొప్పవి : మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సమాజ పురోగతికి సాహిత్యం ప్రధాన హేతువని మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ అన్నారు. బుధవారం విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని న్యాయవాది నాగరాజ్ పాత్రోతో కలిసి సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద కమీషనర్ ప్రారం భించారు. సంచార పుస్తకాలయ నిర్వాహకులు షరీఫ్ కమీషనర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతించారు. కమీషనర్ పలు రకాల పుస్తకాలను చూసి ఆశ్చర్యాన్ని సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఎందరో సాహిత్యకారుల రచనలకు మూలాలు కల్గిన విశాలాంధ్ర విజ్ఞాన సమితితో నేటి తరానికి కావల్సిన విజ్ఞానం అందుతున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న సాంకేతిక రంగంతో పోటీ పడుతూనే పాఠకుల అభిరుచులకు అనుగుణంగా ప్రచురణలు నిరంతరంగా చేస్తుండటం గర్వకారణమని, పాఠకులకు పుస్తకాలను అందుబాటులో ఉంచటం భారమైనా, సంచార కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సేవలు గొప్పవని కమిషనర్ ప్రశంసించారు.